డ్రెయినేజీ కాల్వల కబ్జా..!

- కాల్వలను మూసివేస్తూ దుకాణాల ఏర్పాటు
- ట్రాఫిక్‌తో ప్రజల ఇబ్బందులు
- ఆక్రమణలు అరికట్టాలని కోరుతున్న స్థానికులు



డ్రెయినేజీ కాల్వలను మూసేసి దుకాణాల ఏర్పాటు



బ్యాంక్ స్ట్రీట్‌లో కాల్వపై నిర్మాణ పనులు

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన వీధుల్లో రోడ్లకు ఇరుపక్కల ఉన్న డ్రెయినేజీ కాల్వలను వ్యాపారులు కబ్జా చేస్తున్నారు. కాలవ్లను కబ్జా చేయడంతోపాటు దుకాణాల ముందు తోపుడు బండ్లు, జ్యూస్ డబ్బాలు, కూరగాయల దుకాణాలను ఏర్పాటు చేస్తుండడంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాజకీయ నాయకుల అండతో మేయిన్ రోడ్డు, బ్యాంక్ స్ట్రీట్, సెకండ్ మెయిన్ రోడ్, రైల్వేస్టేషన్ సెంటర్ తదితర ప్రాంతాల్లో రాత్రికి రాత్రే రోడ్ల పక్కన దుకాణాలు ఏర్పాటవుతున్నాయి. ప్రధాన వీధుల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న కాల్వలను మూసివేస్తూ దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. ఎండాకాలం ప్రారంభం కావడంతో గాంధీ సెంటర్, మెయిన్ రోడ్డులోని పలుప్రాంతాల్లో కాల్వలను మూసివేస్తూ జ్యూస్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. కొంతమంది తమ దుకాణాల ముందు స్థలాన్ని నెలవారీ అద్దెకు ఇస్తుండటం గమనార్హం. మెయిన్ రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా కాల్వలను కబ్జా చేస్తున్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు

కాల్వలు మూసుకుపోయి అందులో పేరుకుపోయిన వ్యర్థాలతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. గాంధీ సెంటర్‌తోపాటు మేయిన్ రోడ్డు, బ్యాంక్ స్ట్రీట్‌లో రోడ్లకు ఇరువైపులా చిరు దుకాణాల ఏర్పాటుతో రోడ్డు మూసుకుపోయి ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గాంధీసెంటర్ సమీపంలో ఓ దుకాణం ముందు మంగళవారం సైడు కాల్వపై నిర్మాణ పనులు చేస్తుండగా మున్సిపల్ సిబ్బంది అడ్డుకోవడంతో నిర్మాణ పనులు నిలిచాయి. రోడ్లు, సైడు కాల్వలను ఆక్రమించి ఏర్పాటు చేస్తున్న దుకాణాలకు మున్సిపాలిటీ నుంచి అనుమతులు లేకపోవడంతోపాటు ఎలాంటి ఆదాయం చేకూరడం లేదు. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు స్పందించి డ్రెయినేజీ కాల్వల ఆక్రమణలను అరికట్టాలి. అంతేకాకుండా రోడ్లపై ఏర్పాటు చేస్తున్న దుకాణాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

- మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్



మాట్లాడుతున్న రెడ్యానాయక్

కురవి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మంగళవారం నూతనంగా ఏర్పడిన సీరోలులో మండలస్థాయి విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు అధిక సంఖ్యలో గెలిచి సత్తాచాటుతారని, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలే తగిన బుద్ధిచెబుతారని అన్నారు. అనంతరం మండల అడ్‌హాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా కొండపల్లి శ్రీదేవీ, తేజావత్ బోజ్యానాయక్, పెద్ది వెంకన్న, కొండపల్లి విజయ్‌పాల్‌రెడ్డి, ఆంగోత్ వెంకన్న, మామిండ్ల వెంకన్నలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు బజ్జూరి పిచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు తోట లాలయ్య, కాంపల్లి సొసైటీ చైర్‌పర్సన్ కొండపల్లి శ్రీదేవీ, పెద్ది వెంకన్న, నరహరి, భోజ్యానాయక్ పాల్గొన్నారు.

నేటినుంచి మేడారానికి బస్సు

నెహ్రూసెంటర్: మేడారం సమ్మక్క–సారలమ్మ మినీ జాతరను పురస్కరించుకుని నేటి నుంచి జాతరకు స్పెషల్ బస్సు సర్వీసు ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ మంగళవారం తెలిపారు. ఉదయం 8గంటలకు డిపో నుంచి ప్రారంభమై మధ్యాహ్నం 12గంటలకు మేడారం చేరుకుంటుందని, సాయంత్రం 5గంటలకు మేడారంలో బయల్దేరి మహబూబాబాద్‌కు రాత్రి 9గంటలకు బస్సు చేరుకుంటుందని తెలిపారు. వన దేవతల దర్శనానికి వెళ్లే భక్తులు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

పెద్దవంగర: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. మంగళవారం మండలంలోని బొమ్మకల్లు, పోచారం గ్రామాల్లోని ముఖ్య కార్యకర్తలతో సమావేశం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, వీరన్న, లక్ష్మీబాలు, సీతనాయక్, వెంకన్న, రాంమూర్తి పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల డ్రాఫ్ట్ జాబితా విడుదల



తొర్రూరు: పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను విడుదల చేస్తున్న ఎంపీడీఓ

తొర్రూరు: స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా మండలంలోని 15ఎంపీటీసీ స్థానాల పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను అధికారులు విడుదల చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పూర్ణచందర్‌రెడ్డి 81పోలింగ్ కేంద్రాల జాబితాను విడుదల చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలను ఈనెల 13వ తేదీ వరకు స్వీకరించి 14న పరిష్కరిస్తామని తెలిపారు. ఈనెల 13న రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు నిశాంత్, ఆంజనేయులు, ఏపీఓ మధు, సిబ్బంది పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్: జెడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికలకు సంబంధించిన డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ల జాబితాను ఎంపీడీఓ రఘుపతిరెడ్డి మంగళవారం విడుదల చేశారు. త్వరలో జరగనున్న ఒక జెడ్పీటీసీ, 13 ఎంపీటీసీ స్థానాలకుగాను 76 పోలింగ్ స్టేషన్లను ఎంపిక చేశామన్నారు. అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈనెల 13వ తేదీ గురువారం సాయంత్రంలోగా తెలియజేయాలన్నారు. 14న అభ్యంతరాలను పరిశీలించి, 15న పోలింగ్ స్టేషన్ల తుది జాబితా ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ఉరేసుకొని ఆత్మహత్య

గార్ల: డబ్బులు ఎందుకు వృథా చేస్తున్నావని భార్య మందలించినందుకు, ఓ భర్త క్షణికావేశంలో మిర్చితోటకు వెళ్లి తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా మంగళవారం తెలిపారు. గార్ల మండలం సీతంపేట గ్రామానికి చెందిన బానోత్ ధర్మ(48) మిర్చిపంట అమ్మగా వచ్చిన డబ్బులు వృథాగా ఎందుకు ఖర్చు చేస్తున్నావని భార్య మందలించింది. దీంతో భార్యతో గొడవపడి ధర్మ ఈనెల 10న సోమవారం రాత్రి మిర్చితోటకు వెళ్లి తాడుతో ఉరి వేసుకున్నాడు. మృతుడి తల్లి తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కేంద్రం విధానాలతో ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

తొర్రూరు/దంతాలపల్లి/నెల్లికుదురు: కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలుగుతోందని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 28న ఢిల్లీలో జరిగే జాతీయ సదస్సు కరపత్రాలను మంగళవారం డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో పార్టీ నాయకులు ఆవిష్కరించారు. రవి మాట్లాడుతూ బీజేపీ అధికారం చేపట్టాక దేశవ్యాప్తంగా మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయని, సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, నాయకులు చింతా నవీన్, గజ్జి యాకయ్య, తండా నరేష్, సురేందర్, యాకయ్యలు పాల్గొన్నారు.

పరామర్శ..

కురవి: మండలంలోని నల్లెల్ల మాజీ సర్పంచ్ యర్రంరెడ్డి సుధాకర్‌రెడ్డి ఇటీవల మృతిచెందగా విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు మాలోత్ నెహ్రూ నాయక్ మంగళవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో మెరుగు సత్య నారాయణ గౌడ్, యాదగిరిరెడ్డి, అంబటి వీరభద్రం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆల్‌ఇన్‌వన్ పుస్తకాల పంపిణీ

కేసముద్రం: కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని జెడ్పీ హైస్కూల్‌లో ఎస్‌ఎఫ్‌హెచ్‌సీ ఫౌండేషన్, బ్రహ్మసమాజ్ సౌజన్యంతో పదో తరగతి విద్యార్థులకు ఆల్‌ఇన్ వన్ గైడ్స్, పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్, డిక్షనరీ బుక్స్‌లను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో పీఈటీ కొమ్ము రాజేందర్, కమలాకర్, నర్సింహరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధైర్యంతో పరీక్షలు రాయాలి

తొర్రూరు రూరల్: పదో తరగతి పరీక్షలను ధైర్యంతో ఎదుర్కోవాలని ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య కోరారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మోటివేషనల్ అండ్ గైడెన్స్ కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ సెక్రెటరీ యోగితారాణి వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రసంగించగా మండలంలోని చెర్లపాలెం హైస్కూల్‌లో ఎంఈఓ బుచ్చయ్యతోపాటు విద్యార్థులు వీక్షించారు.

బోనస్ డబ్బులు ఖాతాల్లో జమచేయాలి

గూడూరు: ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం సన్న వరి ధాన్యం బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమచేయాలని సీపీఐ మండల కార్యదర్శి మాలోతు రవీందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

మార్కెట్‌లో కళాబృందం ప్రదర్శన

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్ యార్డులో తెలంగాణ సాంస్కృతిక సారథి కొమిరె వెంకన్న కళాబృందం ఆధ్వర్యంలో మంగళవారం మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తూ, ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కళాకారులు బండ వెంకన్న, జబర్దస్త్ రాజమౌళి, ఉప్పరి సురేష్, మిట్టగడుపుల భరత్ పాల్గొన్నారు.

ఇళ్లపై రాళ్లు పడుతున్నాయి..!

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని వడ్డెర కాలనీలో వారం రోజుల నుంచి తమ ఇళ్లపై రాత్రి వేళల్లో రాళ్లు, మట్టి పెళ్లలు పడుతున్నాయని స్థానిక నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా పసుపు, కుంకుమ చల్లుతున్నారని, నిమ్మకాయలు వేయటం, చేతబడి పూజలు చేయటంతో ఇళ్లు ఖాళీచేసి వెళ్లిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. కాలనీవాసులు పోలీసులకు ఫిర్యాదు చేయగా టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ స్థానికులతో మాట్లాడి ధైర్యం కల్పించారు. రాత్రి సమయాల్లో గస్తీ ముమ్మరం చేసి ప్రజలకు భద్రత కల్పిస్తామని, ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక

నెల్లికుదురు: ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌నకు మండలంలోని రాజులకొత్తపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన 8వ తరగతి చదువుతున్న విద్యార్థినులు గుండెల దివ్య, వరిపెల్లి భవ్యశ్రీ ఎంపికైనట్లు ఉపాధ్యాయుడు రామయ్య మంగళవారం తెలిపారు. అనంతరం విద్యార్థినులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

బీసీ కులగణన మళ్లీ చేపట్టాలి



మాట్లాడుతున్న బీసీ సంఘాల నాయకులు

నెహ్రూసెంటర్: బీసీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మున్నూరుకాపు, పద్మశాలి, గౌడ, పెరక, ముదిరాజ్, కుమ్మరి, విశ్వబ్రాహ్మణ, దూదెకుల, గంగపుత్ర, నాయిబ్రాహ్మణ బీసీ సంఘాల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీ జనాభాను తక్కువగా చూపి బీసీలకు వచ్చే రిజర్వేషన్, ఫలాలు అందకుండా నష్టం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ జన గణన మళ్లీ చేపట్టాలన్నారు. తెలంగాణలో బీసీలు 58శాతానికి పైగానే ఉంటారని పేర్కొన్నారు. జనాభాలో సగంభాగం ఉన్న బీసీలకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. లేకుంటే ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో కుల సంఘాల నాయకులు డోలి సత్య నారాయణ, వై.కృష్ణప్రసాద్, అనుమాండ్ల వెంకటేశ్వర్లు, నాజర్ అహ్మద్, దుగ్గి గోపాల్, గునిగంటి కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో ఒకరిపై కేసు నమోదు

నెల్లికుదురు: దాడిచేసిన ఘటనలో ఒకరిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపారు. మంగళవారం విలేకరులతో ఎస్సై మాట్లాడుతూ ఇనుగుర్తి మండలం మీఠ్యతండాకు చెందిన గుగులోతు రమేష్‌పై అదే తండాకు చెందిన బానోతు శంకర్ సోమవారం రాత్రి గ్రామ పరిధిలోని లైన్‌తండా వద్ద దాడి చేసినట్లు తెలిపారు. దాడిలో రమేష్ తలకు బలమైన గాయాలు కావడంతో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. బాధితుని బామ్మర్ది బానోతు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు బానోతు శంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక తరలిస్తే కఠిన చర్యలు



బయ్యారం: ఇసుకను తరలించకుండా పొక్లెయినర్‌తో ట్రెంచ్ తవ్విస్తున్న సీఐ, ఎస్సై

బయ్యారం/డోర్నకల్/మరిపెడ/గూడూరు/దంతాలపల్లి /నెల్లికుదురు మండలంలోని వాగుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గార్ల–బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతి హెచ్చరించారు. ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ ఆదేశాల మేరకు మండలంలోని అలిగేటిలోకి ఇసుక కోసం ట్రాక్టర్లు వెళ్లకుండా జేసీబీతో కందకం తవ్వించారు.

పెద్దవంగర: ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై క్రాంతి కిరణ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఇసుక రవాణా చేసేందుకు ఎలాంటి అనుమతులు లేవని, ఎవరైన అక్రమంగా తరలిస్తే తగు చర్యలు తీసుకుంటామన్నారు.

కోతలు లేకుండా విద్యుత్ సరఫరా

- విద్యుత్‌శాఖ ఎస్‌ఈ జె.నరేశ్



మాట్లాడుతున్న ఎస్‌ఈ నరేష్

నెహ్రూసెంటర్: వేసవి కాలం దృష్ట్యా పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ జె.నరేశ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో సబ్ ఇంజనీర్లు, ఏఈ, విద్యుత్ అధికారులతో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ... నిరంతరం విద్యుత్ అందించేలా ఎప్పటికప్పుడూ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. వినియోగదారులకు కోతలు లేకుండా విద్యుత్‌ను సరఫరా చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో డీఈలు విజయ్, పెద్ది రాజం, సునీతాదేవి, మధుసూధన్, సీనియర్ అకౌంట్ ఆఫీసర్ రమాదేవి, ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.

9 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత



పట్టుకున్న బెల్లం చూపిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

తొర్రూరు: గుడుంబా తయారీకి వినియోగించే నల్ల బెల్లం, పటిక, నాటుసారాను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా నిర్మూలన కోసం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తొర్రూరు డివిజన్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో వరుసదాడులు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో పట్టుబడిన 9క్వింటాళ్ల నల్లబెల్లం, 2 క్వింటాళ్ల పటిక, 120 లీటర్ల నాటుసారా, రవాణాకు వినియోగిస్తున్న 10వాహనాలను సీజ్ చేశారు. 16 మందిపై కేసులు నమోదు చేశారు. తొర్రూరును గుడుంబా రహితంగా మార్చేందుకు సహకారం అందించాలని ఎక్సైజ్ ఏఈఎస్, తొర్రూరు ఇన్‌చార్జ్ ఆర్.ప్రవీణ్ కోరారు. దాడుల్లో ఎస్సైలు రవళిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు

- సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

నెహ్రూసెంటర్: స్థానిక ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ కమిటీ నాయకుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నారని, వాటి పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో నాయకులు ఉద్యమాలను నిర్వహించాలన్నారు. రానున్న వేసవికాలం దృష్ట్యా మంచినీటి కొరత లేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య, సమ్మెట రాజమౌళి, రావుల రాజు, చీపిరి యాకయ్య, హేమనాయక్, బానోత్ వెంకన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

నృత్యోత్సవ వేడుకలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



మహబూబాబాద్ రూరల్: హైదరాబాదులోని రవీంద్రభారతి వేదికగా ఈనెల 17వ తేదీన తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ, తాండవ కృష్ణ నృత్య అకాడమీ ఆధ్వర్యంలో భారతీయ నృత్యోత్సవ వేడుకలు జరుగనున్నాయి. మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, ఉమ దంపతులను అకాడమీ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. వాటికి సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే దంపతులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో తాండవ కృష్ణ ఉమెన్స్ ఆర్గనైజర్ అధ్యక్షురాలు ఉదయశ్రీ, లావణ్య, సింధు, అరుణ, రమ్యకృష్ణ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌లో ఇళ్లను నిర్మించకుండానే, ఓపెన్ ప్లాట్లలకు నిబంధనలకు విరుద్ధంగా జీపీ నిర్వాహకులు ఇంటి నంబర్లను జారీ చేశారని ఆరోపిస్తూ మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు మాజీ సర్పంచ్ సట్ల నర్సయ్య, చెన్నారెడ్డి, మర్రిపెల్లి మొగిలి, సట్ల శ్రీను,కొలిపాక బాబు, బిచ్చానాయక్, కట్కూరి శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు.

సైకిళ్ల పంపిణీ

నెల్లికుదురు: మిడ్ వెస్ట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మండలంలోని మునిగలవీడు ఉన్నత పాఠశాల బాలికలకు సైకిళ్లను అందించినట్లు హెచ్‌ఎం స్వప్న తెలిపారు. మంగళవారం పాఠశాలలో బాలికలకు సైకిళ్లను అందించారు. కార్యక్రమంలో మిడ్‌వెస్ట్ అకౌటెంట్ మల్లయ్య, రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

గూడూరు: మండల కేంద్రంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఈనెల 13న పలు కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాల వేలంపాట నిర్వహించనున్నట్లు సీఐ ఎస్.భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా ఒక్క వాహనానికి రూ.20వేలు ఈఎండీగా చెల్లించి పాటలో పాల్గొనాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీకి ఎంపిక



మహబూబాబాద్ రూరల్: మండలంలోని మాధవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి నక్క విష్ణువర్ధన్ జిల్లాస్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్టులో ప్రథమ బహుమతిని గెలుచుకుని రాష్ట్రస్థాయి పోటీకి అర్హత సాధించాడని హెచ్‌ఎం సంకా బద్రినారాయణ తెలిపారు. మంగళవారం విద్యార్థిని అభినందించారు. ఉపాధ్యాయులు బాబురెడ్డి, స్నేహలత, పరమాత్మచారి పాల్గొన్నారు.

కోర్సు ప్రకారం మందులు వాడాలి



గార్ల: కుష్టు వ్యాధిగ్రస్తులు ప్రభుత్వ వైద్యుల సూచనల మేరకు విధిగా కోర్సు ప్రకారం మందులు వాడాలని జిల్లా డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ (డీపీఎంఓ) డాక్టర్ ఎం.ఎల్లయ్య సూచించారు. స్పర్శ్ కార్యక్రమం పురస్కరించుకొని మంగళవారం గార్ల, మర్రిగూడెం, పుల్లూరు సబ్‌సెంటర్‌లో అనుమానిత కుష్టు రోగులకు ఆయన వైద్య పరీక్షలు చేశారు. డీపీఎంఓ వెంట సూపర్‌వైజర్లు ఇస్మాయిల్‌బేగ్, వెంకటేశ్వరరావు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నివాళి

మహబూబాబాద్ అర్బన్: పండిట్ దీన్‌దయాళ్ అడుగుజాడలు అనుసరనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం పండిట్ దీన్‌దయాళ్ వర్ధంతి సందర్భంగా బీజేపీ నాయకులు పండిట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యావర్గ సభ్యులు యాప సీతయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మోసంగి మురళీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు లక్ష్మణ్‌రావు, పట్టణ అధ్యక్షుడు అజయ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

బొడ్రాయి వేడుకల ఏర్పాట్ల పరిశీలన

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో గ్రామ దేవత బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కాగా గ్రామ దేవత బొడ్రాయి తల్లిని తెలంగాణ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ దర్శించుకుని పూజలు చేశారు. ఏర్పాట్లను ఎమ్మెల్యే మురళీనాయక్ పరిశీలించి, నిర్వహణ కమిటీ బాధ్యులకు పలు సూచనలు చేశారు.